క్లుప్తంగా

టింబర్‌యార్డు కార్మికుల వేతనాలు పెంచాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లోని టింబర్‌యార్డులో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ హెచ్‌ఎమ్మెస్ నాయకులు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం ఆ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో నాయకులు జీఎంను కలిసి వినతిపత్రం అందించారు. 30ఏళ్లుగా పనిచేస్తున్న టింబర్ యార్డు కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. వీరు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. వీరికి 1వ కేటగిరి వేతనాలు అమలు చేసి ఎస్‌ఎల్పీ కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ సెంట్రల్ ఆర్గనైజర్ దుర్గం లక్ష్మణ్, నాయకులు నామాల శ్రీనివాస్, ఆయిల్ల రమేశ్, పల్లె క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 19న ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్సు పాస్‌ల పంపిణీ జరుగుతుందని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. రాజీవ్‌చౌక్, గణేష్ నగర్ టెంపుల్ వద్ద బస్‌పాసుల పంపిణీ జరుగుతుందన్నారు. అంగవైకల్యం 40శాతం పైన మూగా, చెవుడు, కంటి వారికి 100శాతం ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

లక్సెట్టిపేట: మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సోమవారం పరిశీలించారు. గాంధీచౌక్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు చేపట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులు, సబ్‌స్టేషన్ నుంచి కస్తూర్బా విద్యాలయం వరకు బీటీ రోడ్డు పనులు, అక్సా మసీదు నుంచి వేంకటేశ్వరస్వామి గుట్ట వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి, లక్ష్యం పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వడదెబ్బపై అవగాహన

కోటపల్లి: మండలంలోని పంగిడిసోమారంలో గ్రామస్తులకు వడదెబ్బపై కోటపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ అసిస్టెంట్ శ్రీనాథ్ అవగాహన కల్పించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో తప్పనిసరి అయితేనే బయటికి వెళ్లాలని, కాటన్ బట్టలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసి, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ఆత్మీయ సమ్మేళనాలు

చెన్నూర్: పట్టణంలోని ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో ఈ నెల 20న కోటపల్లి మండల బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబాలు 21న చెన్నూర్ పట్టణ బీఆర్‌ఎస్ కుటుంబాల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. ఆత్మీయ సమ్మేళనాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భోజన విరామం తర్వాత గ్రామాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. సమ్మేళనాలకు బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు హాజరుకావాలని కోరారు.

రంజాన్ కానుకలు పంపిణీ

జన్నారం: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పండుగలకు ఆదరణ కోల్పోయినా, బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజల, అన్ని మతాల పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదింటి ప్రజలు పండుగను ఘనంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో సీఎం కానుకలను అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో వంద మంది ముస్లింలకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు రంజాన్ కానుకలను(తోఫా)బీఆర్‌ఎస్ నాయకులు ఆరీఫ్ అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు అయుబ్, బీఆర్‌ఎస్ నాయకులు అమన్, తిరుపతి, ఏజాస్, అంజాత్, సురేశ్ పాల్గొన్నారు.

ప్రజా‘వాణి’ వినేవారేరి..!

- మొక్కుబడిగా గ్రీవెన్స్
- గైర్హాజరవుతున్న అధికారులు
- కింది స్థాయి సిబ్బందిని పంపించి మమా అనిపిస్తున్న వైనం



భీమారం ప్రజావాణిలో ఖాళీగా ఉన్న అధికారుల సీట్లు

కోటపల్లి: మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం మండల కేంద్రంలో చేపట్టే ప్రజావాణి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ప్రజావాణికి మండలస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కింది స్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపేసుకుంటున్నారు. సమస్యలు పరిష్కరించే అధికారులే నిర్లక్ష్యంగా ఉండటంతో దరఖాస్తు చేసేందుకు ఎవరూ రావడంలేదని మండలవాసులు అనుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండలస్థాయి అధికారులు హాజరయ్యేలా చూడాల్సి ఉందని మండలవాసులు కోరుతున్నారు.

ప్రజావాణికి అధికారుల డుమ్మా

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. మండల ప్రత్యేక అధికారితో పాటు ఎంపీడీవో, రెవెన్యూ, బీసీ వెల్ఫేర్, వైద్య, ఆరోగ్య, మిషన్ భగీరథ, నీటిపారా, విద్యుత్‌శాఖలకు చెందిన అధికారులు ఎవ్వరూ రాలేదు. కేవలం ఎంపీడీవో కార్యాలయంలో రోజు ఉండే ఈజీఎస్ సిబ్బంది మాత్రం హాజరయ్యారు. ఈ విషయంలో కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజావాణికి మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు ఫిర్యాదులు..

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి కత్తెరసాల గ్రామానికి సంబంధించిన రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకే దరఖాస్తు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి ఒకే దరఖాస్తు వచ్చింది. అది కూడా ఈబీసీ సర్టిఫికెట్ కోసం వచ్చిన దరఖాస్తు దారుడు ఏకంగా ప్రజావాణిలో తహసీల్దార్ రాజలింగుకు అందజేయగా, ఆ సమస్యను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణిలో మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి మార్గం రజిత, మండల పశువైద్యాధికారి సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత ఫిర్యాదుల విభాగంలో పాల్గొన్నారు.

దండేపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు వచ్చినట్లు ప్రత్యేకాధికారి ప్రకాశ్ తెలిపారు. చెరువుకట్ట, తూముల ఏర్పాటుతో పాటు, కుల బహిష్కరణకు సంబంధించిన వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. తహసీల్దార్ హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

తనను కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, మండలంలోని పెద్దపేటకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన జంగం రాజయ్య సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ హన్మంతరావుకు ఫిర్యాదు చేశాడు. వయస్సు పైబడ్డ తనను ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘ పెద్దలపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.



దండేపల్లిలో తహసీల్దార్‌కు అర్జీదారుల వినతి



హాజీపూర్‌లో దరఖాస్తు సమర్పిస్తూ...



ప్రజావాణిలో పాల్గొన్న ఎంపీడీవో

కల్వర్టుకి మరమ్మతు చేపట్టండి

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండలంలోని ఆరెపల్లి నుంచి కుందారం వెళ్లే ప్రధాన రహదారిలోని కల్వర్టు తెగిపోయి సంవత్సరాలు గడుస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శ్రీనివాస్, ఎంపీడీవో ఫోన్ నంబర్ : 98669 20530

నేటి నుంచి ప్రజాపోరు యాత్ర ప్రారంభం



బెల్లంపల్లి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న కామ్రేడ్స్

బెల్లంపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ఈ నెల 18వ తేదీ నుంచి ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ తెలిపారు. బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో సోమవారం ప్రజాపోరు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. తాండూర్ మండల కేంద్రం ఐబీ నుంచి ప్రజాపోరుయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై సాయంత్రం 4గంటలకు పోరుయాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా నెల రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వ మతోన్మాద విధానాలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తామన్నారు. మే 17న బెల్లంపల్లిలో నిర్వహించే సభతో ప్రజాపోరు యాత్ర ముగుస్తుందని వివరించారు. ప్రజలు యాత్రకు ఘనస్వాగతం పలికి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, జీసీ మాణిక్యం, అక్కెపల్లి బాపు, ఆడేపు రాజమౌళి, బియ్యాల ఉపేందర్, బండారి శంకర్, పులికాక స్వామిదాస్, తిరుమలేష్, ప్రశాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ పోరు యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేష్, పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రవీందర్, శ్రీహరి, సంపత్, రాజ్‌కుమార్, కార్మికులు తదితరులున్నారు. మండలంలోని కోమటిచేనులో సీపీఐ ఆధ్వర్యంలో పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరించగా జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టయ్య, సత్తయ్య, పోశం, సర్వేశం, రాజలింగు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యతకు ప్రతీక రంజాన్



ఎమ్మెల్యేకు పండ్లు తినిపిస్తున్న ముస్లింలు

తాండూర్: పరమ పవిత్రమైన రంజాన్ పండుగను తరాల నుంచి మత సామరస్యతకు ప్రతీకగా నిలుస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ ఐబీ మసీదు, తాండూర్ పెద్ద మసీదులో సోమవారం రాత్రి ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వేర్వేరుగా దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు ముగించుకుని, ఉపవాస దీక్షలు విరమించారు. ఎమ్మెల్యే చిన్నయ్య ముస్లింలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పండ్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండుగ ముస్లింలకు అత్యంత పర్వదినమన్నారు. పండుగ వేళ తోచిన రీతిలో పేదలకు ధానధర్మాలు చేయడం చేస్తుంటారని గుర్తు చేశారు. ఎంతో పవిత్రంగా ఉపవాసం ఉండి భక్తిని చాటుకుంటారన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీలు సిరంగి శంకర్, మొగిలి శంకర్, మాజీ జెడ్పీటీసీ సురేష్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ దత్తుమూర్తి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు దత్తాత్రేయరావు, మాజీ జెడ్పీ చైర్మన్ పురుషోత్తంగౌడ్, మండల కో ఆప్షన్ సభ్యుడు రహెమత్ ఖాన్, బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు గౌస్, మసీదు కమిటీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు, మత పెద్దలు పాల్గొన్నారు.

‘సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం’

బెల్లంపల్లి: దివంగత మున్సిపల్ కౌన్సిలర్ ఎస్‌కే యూసుఫ్ జ్ఞాపకార్థం కుటుంబీకులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. మున్సిపాలిటీలోని గోల్‌బంగ్లా బస్తీలో సోమవారం యూసుఫ్ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై యూసుఫ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యుల తరఫున 300మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, వార్డు కౌన్సిలర్, యూసుఫ్ సతీమణి షేక్ ఆస్మా, ఇతర కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, బస్తీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

వీవోఏల నిరవధిక దీక్షలు



భీమారం ఐకేపీ కార్యాలయం ఎదుట దీక్ష



దండేపల్లి: రిలే దీక్షలో వీవోఏలు

కాసిపేట/భీమారం/దండేపల్లి/లక్సెట్టిపేట/కోటపల్లి: ఐకేపీ వీవోఏలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం నుంచి నిరవధిక దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 3 నుంచి సమ్మెకు పిలుపునివ్వగా ఆందోళనలో భాగంగా సోమవారం దీక్ష చేపట్టినట్లు తెలిపారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26వేలు, 10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, నేటి వరకు ఇవ్వాల్సిన వీఎల్‌ఆర్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కోటపల్లిలో స్త్రీ శక్తి భవనం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అన్ని మండలాల నుంచి వీఓఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలపై దృష్టి పెట్టండి

- అధికారులకు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అంతకుముందు అధికారులు నివేదికలు చదివి వినిపించగా, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పకుండానే ముగించారు. కడెం ప్రధాన కాలువకు ఇరువైపులా భూమి కబ్జా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ విషయంలో ఇదివరకే సమావేశంలో పలుమార్లు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సభ్యులు వినయ్‌కుమార్, మున్వర్‌అలీఖాన్, రియాజోద్దీన్‌లు ఆరోపించారు. ఎమ్మెల్యే రాగానే నీటి సమస్యపై పలువురు సభ్యులు తెలియజేయడంతో ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రావ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల నుంచి నీటి సమస్యపై నేరుగా ఫోన్లు వస్తున్నాయని, ఈ విషయంలో అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల సమస్యలపై ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలని సూచించారు. ఫోన్ నాకు వస్తుందంటే.. మీ స్పందన లేదని అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు లేకుండా చూడాలని సూచించారు.

కార్యదర్శుల వినతి..

సర్వసభ్య సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే రేఖానాయక్ రాగానే ఆమెకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ కిషన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	100
బీరకాయ	80
వంకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	30
సోరకాయ	20
ఆకుగోబి	20
పూగోబి	60
పాలకూర	30
తోటకూర	30
ములక్కాయ	40

- మంచిర్యాలఅగ్రికల్చర్



సంక్షిప్త వార్తలు

నిధులు కేటాయించాలని వినతి

జైపూర్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ భవనం నిర్మించి అసంపూర్తిగా వదిలేశారని నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షులు కదారి రమేశ్, మండల అధ్యక్షుడు జనంపల్లి సంపత్‌మాదిగ, మండల ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌మాదిగ, నాయకులు బూడిద సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం

తాండూర్: అఖిల భారత కిసాన్‌సభ (తెలంగాణ రైతు సంఘం) 88వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం తాండూర్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొండు బానేష్ ముఖ్య అతిథిగా హాజరై పతాకావిష్కరణ చేశారు.

పశువుల సంతలో తాగునీటి కష్టాలు

చెన్నూర్: పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువుల వారసంతలో తాగునీరు లేక రైతులు సోమవారం ఇబ్బంది పడ్డారు. వంద మందికి పైగా విక్రయదారులు, కొనుగోలు దారులు పాల్గొనగా, తాగునీరు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంతలో పశువును విక్రయిస్తే రూ. 400 పన్ను వసూల్ చేస్తుండగా, రైతులకు కనీసం నీటి వసతి కల్పించక పోవడంతో మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

దండేపల్లి/చెన్నూర్‌రూరల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. దండేపల్లిలోని వెల్గనూర్‌లో, చెన్నూర్‌రూరల్ మండలంలోని ఎర్రగుంటపల్లిలో కంటి వెలుగు వైద్య శిబిరాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో దండేపల్లిలో సర్పంచ్ బిల్లకూరి శంకరయ్య, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీవో మల్లేశం, చెన్నూర్‌లో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, సర్పంచ్ మడక స్వప్న, రవి, ఉప సర్పంచ్ జనగామ రాజశేఖర్, కార్యదర్శి కిరణ్ ఉన్నారు.

‘ఎస్సైపై చర్యలు తీసుకోవాలి’

కాసిపేట: బెల్లంపల్లి మండలం చాకెపల్లి ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్‌ను దూషించిన మందమర్రి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ సోమవారం డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుండ్ల సోమారం ఎంపీటీసీ దాగం రమేష్, డీసీసీ సభ్యులు లావుడ్య రమేష్, నాయకులు ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్‌విందు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో ముస్లింలకు స్థానిక ఎంపీటీసీ కంది హేమలత, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్ సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ విందులో ముస్లింలతో పాటు ఎంపీటీసీలు శ్రీనివాస్, మోహన్, మాజీ ఎంపీపీ కాంతరావు, కాంగ్రెస్ నాయకుడు రవి, నగేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



చెన్నూర్‌లో గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన



జిల్లా కేంద్రంలో కరపత్రాలు పంచుతూ...

మంచిర్యాలక్రైం: అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో, రైల్వేస్టేషన్, సినిమా థియేటర్‌లలో అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల రూపంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారులు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడేకంటే, జరగకముందే ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. అగ్నిమాపక పరికరాల వినియోగంపై వివరించారు. ఫైర్ ఆఫీసర్ దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో అగ్నిమాపక అధికారులు గ్యాస్ సిలిండర్‌లో మంటలు వచ్చిన సమయంలో ఎలా ఆర్పాలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రాజేందర్, సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో సోమవారం 15మందితో డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ముందుండి పోరాటం చేస్తుందన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ వ్యాప్తంగా విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం హక్కుల కోసం పోరాడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు నిరంజన్, రవికుమార్, శ్రావణ్, రవివర్మ, మండల కమిటీ సభ్యులు శ్రావణ్, ప్రేమ్‌సాగర్, రవి, సంతోష్, స్వామి, కోట రాజేష్, కోటపల్లి మండల కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.